మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## అభిప్రాయ సేకరణ కేంద్రాల ఏర్పాటు

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ఎస్సి వర్గీకరణ తీర్పు విషయంలో సుప్రీంకోర్టు తీర్పు సాధ్య, అసాధ్యాలపై దళితుల నుండి అభిప్రాయాలు స్వీకరించడానికి ఏర్పాటుచేసే ఏకసభ్య కమిషన్ కేంద్రాలు ప్రతి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని జాతీయ మాల మహానాడు హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఆరే కిషోర్ డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి సిద్ధిపేట జిల్లాలో ఏర్పాటుచేసే ఈకేంద్రం సంగారెడ్డిలో ఉంటుండగా హుస్నాబాద్ ప్రాంతం నుండి సంగారెడ్డికి దాదాపు 200ల కిలోమీటర్లు ఉంటుందని, కావున అభిప్రాయాల సేకరణ న్యాయబద్ధంగా జరిగే అవకాశం లేదన్నారు. ఈఅభిప్రాయాల సేకరణ ప్రతి జిల్లా, పట్టణ, మండల, గ్రామాల వారీగా నిర్వహిస్తే తప్ప అందరికి న్యాయం జరిగే పరిస్థితి లేదన్నారు. కావున ఈ విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచన చేసి కనీసం ప్రతి జిల్లాకు ఒక అభిప్రాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెన్న రాజు, మీయా సెల్ కన్వీనర్ జాల శ్రీనివాస్, బురుగు కిష్టస్వామి, సదానందం తదితరులు ఉన్నారు.

## నష్టాల నుంచి లాభాలలో ఆర్టీసీ

**సిద్ధిపేట అర్బన్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మహాలక్ష్మిపథకం ఫలితంగా గతంలో నష్టాలలో ఉన్న ఆర్టీసి సంస్థ నష్టాలను పూర్తిగా అధిగమించి లాభాల బాటలో ప్రయాణిస్తుందని సిద్ధిపేట డిపో మేనేజర్ వై.సుఖేందర్‌రెడ్డి అన్నారు. సిద్ధిపేట జిల్లా కేంద్రంలో డిపో ఆవరణలో గురువారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర రవాణాశాఖ విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగ్యారంటీలలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్ ప్రయాణం పథకం ద్వారా నవంబరు 24 వరకు 3.65 కోట్ల మంది మహిళలు టిజిఎస్ ఆర్టీసిలో ఉచిత ప్రయాణం చేసి 132.66 కోట్ల రూపాయాలను అదా చేసుకున్నారని తెలిపారు. మహాలక్ష్మి ప్రయాణం ద్వారా రోజూ జిల్లావ్యాప్తంగా బస్సులలో ప్రయాణించే ప్రయాణీకుల సంఖ్య గణనీయంగా పెరిగి 1.60 లక్షలకు చేరిందన్నారు. గతంలో ఈ సంఖ్య లక్షలోపే ఉండేదన్నారు. విద్యార్థుల కోసం బస్సులను పెంచడం జరిగిందన్నారు. వివాహాది శుభకార్యాలకు విహారయాత్రలకు అద్దెకిచ్చే బస్సుల చార్జీలను గణనీయంగా తగ్గించామన్నారు. బస్సు స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం గ్యమం యాప్‌ను ప్రవేశపెట్టి ప్రయాణీకుల వెయిటింగ్ సమయాన్ని తగ్గేలా చేశామని పేర్కొన్నారు.

## అక్రమ అరెస్టులకు బిఆర్ఎస్ భయపడదు



విలేకరులతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి నప్రజాపాలన కాకుండా రాక్షసపాలన సాగిస్తున్నారని సిద్ధిపేట పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కాముని శ్రీనివాస్‌లు అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ హామీలను, తప్పిదాలను ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. అన్నిదేవుళ్ళ మీద ఒట్టు పెట్టుకొని అబద్ధాలు ఆడిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చరిత్ర హీనుడు మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుపై తప్పుడు ఆరోపణలతో ఫిర్యాదుచేస్తే కేసు నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. హరీష్ రావు జోలికి వస్తే కాలగర్భంలో కలిసిపోతారని తెలిపారు. ప్రభుత్వాన్ని నిలదీయడంతోనే హరీష్‌రావుపై కక్షగట్టారని మండిపడ్డారు. హరీష్‌రావు జోలికి వస్తే చూస్తూ ఉరుకోమని హెచ్చరించారు. అక్రమ అరెస్టులను బిఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అరాచక పాలన సాగిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డిని సిద్ధిపేట ప్రజలే అంతం చేస్తారని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. అక్రమ అరెస్టులకు బిఆర్ఎస్ భయపడదన్నారు. అనంతరం హరీష్‌రావు అక్రమ అరెస్టును నిరసిస్తూ హౌసింగ్ బోర్డు కామన్ వద్ద సిఎం దిష్టిబొమ్మను దహనం చేశారు.

## కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుంది



యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిచిన వారిని సత్కరిస్తున్న హరికృష్ణ

**సిద్ధిపేట రూరల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీలో యువతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పార్టీని పటిష్ఠం చేయాలన్న ఉద్దేశ్యంతోనే యువజన కాంగ్రెస్ ఎన్నికలు నిర్వహించడం జరిగిందని సిద్ధిపేట నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు. సిద్ధిపేట కాంగ్రెస్‌పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం యువజన కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో గెలుపొందిన నాయకులను ఆయన శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యువత కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తున్నారని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తున్నారని తెలిపారు. యువజన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలుపొందిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీని మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్టీలో యువతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు.

## హరీష్‌రావును ఎదుర్కోలేకే అక్రమ అరెస్టులు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**

ప్రభుత్వ అసమర్థ పాలనపై ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును అక్రమంగా అరెస్టు చేయడం తగదని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ డిసెంబరు 9న శాసన సభ సమావేశాలు ప్రారంభం అవుతున్నాయని, సభలో మాజీ మంత్రి హరీష్‌రావు పాల్గొంటే తమ అసమర్థతను బట్టబయలు చేస్తారన్న భయంతోనే హరీష్‌రావును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్రమంగా అరెస్టు చేయించారని మండిపడ్డారు. కడిగిన ముత్యంలా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు కేసుల నుంచి బయటపడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి సభ్యులు లక్ష్మీబాయి రవీందర్ నాయక్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు పరమేష్, నాయకులు విఠల్‌రావు పాటిల్, అభిషేక్ శెట్కార్, నజీబ్, పరశురాం, నగేష్ సేట్, ముజామిల్, వెంకన్న,రాజు, చింటూ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## 14న జాతీయ లోక్ అదాలత్

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**

డిసెంబరు 14వ తారీఖున జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి భవాని చంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్ తగాదాలు, కుటుంబ తగాదాలు, మోటారు వాహన ప్రమాద నష్ట పరిహార కేసులు, క్రిమినల్ కాంపౌండిగ్ కేసులు, 1389 ఎన్ఐ యాక్ట్ కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, టెలిఫోన్ రికవరీ కేసులను రాజీ కుదుర్చుకునే అవకాశం ఉందన్నారు. అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయమూర్తి భవాని చంద్ర సూచించారు.

# మహిళల్లో ఆర్థిక స్వావలంబన పెంపొందించాలి

### మంత్రి దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 5, ప్రభాతవార్త:**

జిల్లాలో ఇందిరాక్రాంతి, మహిళాశక్తి పథకం కింద నిర్వహించిన అనేక కార్యక్రమాల ద్వారా మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖామంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలు 2024 ఇందిరా క్రాంతిపథకం మహిళాశక్తిలో భాగంగా గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళా క్యాంటీన్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు కలిసి ప్రారంభించారు. గురువారం మంత్రి దామోదర్ రాజనర్సింహ పుట్టినరోజు సందర్భంగా మంత్రికి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళాసంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళాశక్తి పథకం రాష్ట్రాభివృద్ధి లక్ష్యాలకూ, సమాజ ఆర్థికప్రగతికీ ప్రధానమైనదని మంత్రి పేర్కొన్నారు. ఇందిరా క్రాంతిపథకం, మహిళల ఆర్థిక స్వావలంబనాన్ని పెంచి, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించడమే ప్రధాన ఉద్దేశ్యం అని, మహిళాశక్తి పథకం కింద మహిళా సంఘాలకు మాత్రమే ఈ క్యాంటీన్ నిర్వహణ బాధ్యతలు అప్పగించబడిందన్నారు. మహిళలు సాధికారత, ఆర్థిక స్వావలంబన పెంపొందించాలని అన్నారు. ఈ క్యాంటీన్ మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంలో సహాయపడుతుందన్నారు. ఇంకా ఈ మహిళా క్యాంటీన్లు ప్రజలు అధికసంఖ్యలో వచ్చే ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళల ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించడం ద్వారా కుటుంబాల స్థితి మెరుగవుతుందని మంత్రి అన్నారు.



క్యాంటిన్ ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ కలెక్టరేట్ క్యాంటీన్ ప్రారంభించడం ద్వారా ఆర్థికం గా వెనుకబడిన మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతా యని కలెక్టర్ తెలిపారు. వివిధ రంగాల్లో మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకుని మరింత ముందుకు రావాలని కలెక్టర్ అన్నారు. అనంతరం మహిళాశక్తి పథకం కింద మహిళా సంఘాలకు మొత్తం రూ. 650.20 కోట్ల విలువైన బ్యాంకు లింకేజ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పిడి.జ్యోతి, సంబంధిత శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత ప్రభుత్వ లక్ష్యం

### -మహాలక్ష్మీ పథకం వల్ల బాలికల విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయి
### -జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 5, ప్రభాతవార్త:**

మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహాలక్ష్మీ పథకం వల్ల బాలికల విద్యాప్రమాణాలు మెరుగుపడ్డాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం మెదక్ పట్టణంలోని కొత్త బస్‌స్టాండ్ ప్రాంగణంలో ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల వేడుకలను డిసెంబర్ 1 నుండి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఐదవరోజులో భాగంగా టిఎస్ఆర్టీసి ఆధ్వర్యంలో మహాలక్ష్మిపథకం అమలుపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ఆర్టీసి డిఎం సురేఖ, వార్డ్ కౌన్సిలర్, సంబంధిత ఆర్టీసి యూనియన్ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో తెలంగాణ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో మహిళలు ఆధార్ కార్డు ద్వారా జీరో టికెట్ కొనుగోలు చేసి 1కోటి 60లక్షలు మంది ఉచిత ప్రయాణం చేసి 53కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహాలక్ష్మిపథకం ద్వారా ప్రభుత్వానికి సంవత్సరకాలంలో 3వేల, 856కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. ఆర్టీసీకి భారం అయినప్పటికీ మహిళలను గమ్యస్థానాలు చేర్చడంలో ఆర్టీసి సిబ్బంది సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆర్టీసి పల్లెవెలుగులు, ఎక్స్‌ప్రెస్‌లలోనే ఉచితప్రయాణం కాకుండా టికెట్ కొనుగోలుచేసే ఆర్థికస్తోమత ఉన్నవారు, ఉద్యోగులు, డీలక్స్ బస్సులలో ప్రయాణించి ఆర్టీసిసంస్థ మనుగడకు చేయూతనివ్వాలని చెప్పారు. ఫుట్‌బోర్డు ప్రయాణం అత్యంత ప్రమాదకరమని, ప్రయాణికులు దీన్ని బాధ్యతగా తీసుకొని గమనించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయాణికులను ఫుట్‌బోర్డులో ప్రయాణం చేయకుండా ఆర్టీసి డ్రైవర్, కండక్టర్ బాధ్యతగా మెలిగి ప్రయాణికులతో మమేకమై పటిష్ఠచర్యలు చేపట్టాలని వివరించారు. దివ్యాంగులకు రిజర్వ్ చేసిన సీట్లను వారికే కేటాయించే విధంగా చూడాలన్నారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఆదేశించిన విధంగా మహిళాశక్తి ద్వారా రుణాలు మంజూరు చేసి వారితో ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయించి అదే బస్సులను ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన తీసుకునే విధంగా చర్యలు చేపడతామని, ఇది జిల్లాలో గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ మాట్లాడుతూ మహాలక్ష్మిపథకం మహిళల పాలిట వరమని, ఎంతోమంది మహిళలు చిరు వ్యాపారాలతో జీవనోపాధి కొనసాగిస్తున్నారని, బాలికలు విద్యాభ్యాసం నిమిత్తం నిత్యం బస్సులలో ప్రయాణించి లబ్ది పొందుతున్నారన్నారు, రాష్ట్ర ప్రభుత్వం ఆరుగ్యారెంటీ పథకాల అమలు క్షేత్రస్థాయిలో సత్ఫలితాలను ఇస్తుందని, ప్రజలు ప్రజాప్రభుత్వాన్ని ఆదరించాలని చెప్పారు.



లక్కీ డిప్‌లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్ తదితరులు

ఆర్టీసి డిఎం సురేఖ మాట్లాడు తూ జిల్లాలో టిఎస్ఆర్టీసి సేవలు మహాలక్ష్మిపథకం అమలు తీరు వివరిస్తూ ఆర్టీసి ఉద్యోగులకు, వారికుటుంబ సభ్యు లకు ఎన్నడూ లేనివిధంగా గ్రౌండ్ హెల్త్ పాలసీ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించి వారి ఆరోగ్య పరిస్థితిని చక్కదిద్దేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఉద్యోగ విధినిర్వహణలో ఆర్టీసి ఉద్యోగులు నిర్వహణలో ఎంత కష్టమైనప్పటికీ క్రమశిక్షణకు మారుపేరుగా పనిచేస్తున్నారని కొనియాడారు. త్వరలో మెదక్ జిల్లాకు పర్యావరణ రహిత ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయని, ఇదొక శుభ పరిణామంగా పేర్కొన్నారు. అంతకు ముందు డీలక్స్ బస్సులలో ప్రయాణించి లక్కీ డిప్‌లో గెలుపొందిన మహిళలకు ముఖ్య అతిథులు శాలువాలు, ఫ్రీ గిఫ్ట్‌లతో సన్మానించారు. ఫుట్ బోర్డు ప్రయాణం ప్రమాదకరమని, ఆర్టీసి ప్రయాణం సురక్షితం, శుభప్రదం అనే నినాదంతో ఆర్టీసి తయారుచేసిన కరపత్రాలను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి యూనియన్ సభ్యులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

### -నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

**వెల్దుర్తి, డిసెంబరు 5, ప్రభాతవార్త:**

వెల్దుర్తి మండలం చర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చర్లపల్లి తండాలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీజగదాంబమాత సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహప్రతిష్ఠ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దుర్గ ఆధ్వర్యంలో విగ్రహప్రతిష్ఠ బ్రహ్మోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ విగ్రహప్రతిష్ఠ మహోత్సవంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఆమె ప్రత్యేకపూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ నూతన ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అశోక్ రెడ్డి, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# స్కిల్ డెవలప్‌మెంట్ ఎంతో ఉపయోగం

### -కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 5, ప్రభాతవార్త**

విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఎంతగానో పపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ (నైపుణ్యత శిక్షణ) కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలమేరకు ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన కలెక్టర్ పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ఒకేసారి వేదికపై ఆరు నెలలకాలం పాటు వివిధరంగాలలో ప్రత్యేక శిక్షణ అందించేందుకు సైనోహబ్ సంస్థ ముందు కొచ్చిందన్నారు. విద్యార్థులకు వివిధ రంగాలలో ఆరు నెలలు శిక్షణ ఇవ్వడం ద్వారా వెనువెంటనే ఉంద్యోగాలు సాధించే అవకాశాలు ఉన్నాయ న్నారు. అనంతరం ఈశిక్షణకు సంబంధించిన కొన్ని విషయాలను కలెక్టర్ విద్యార్థులకు వివరించడంతో పాటు వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం అందించారు.




మాట్లాడున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి బిక్షపతి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, ఆర్డీవో రాంమూర్తి, జిల్లా ప్లానింగ్, ఎంఐఎస్ కోఆర్డనేటర్ రామస్వామి, కెరియర్ గైడెన్స్ విభాగం ఇంచార్జీ కుమారస్వామి, అధ్యాపక బృందం విజయ, షఫీ, ఫాతిమా, సుధామాధురి, రాజ్యలక్ష్మి, అనిల్‌కుమార్, బాల్‌రాజు, చంద్రమౌళి, చుక్క రమేష్, శ్రీనివాస్, సదానందంతో పాటు పాలిటెక్నిక్ కళాశాల బృందం మహేష్, మధుసూధన్‌రెడ్డి, శ్రీను, రాధికతో పాటు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ గ్యారెంటీ హామీలు అమలుచేసే వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీ హామీలను అమలు చేసే వరకు పోరాటం చేస్తామని బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ యేడాది పాలన వైఫల్యాలకు నిరసనగా జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీచౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూది శ్రీకాంత్‌రెడ్డి, విద్యాసాగర్‌లతో కలిసి మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలుచేయని కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకటేనని తెలిపారు. అవినీతి చేసిన నాయకులపై సిఎం రేవంత్‌రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి పట్టిన పెద్ద దరిద్రమని ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు.

## హుస్నాబాద్‌ను గంజాయిరహిత ప్రాంతంగా మార్చుకోవాలి



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న సిఐ శ్రీనివాస్

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 5, ప్రభాతవార్త**

హుస్నాబాద్ ప్రాంతాన్ని గంజాయిరహిత ప్రాంతంగా మార్చుకునేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని హుస్నాబాద్ సిఐ కొంద్ర శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని కెబి కాలనీలో సిద్ధిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు గంజాయి, ఇతర మత్తు పదార్థాల నివారణ గురించి నార్కొటిక్స్ డాగ్స్‌తో అనుమానిత ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుస్నాబాద్ సర్కిల్ పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలలో ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలు, గంజాయి కలిపిన పదార్థాలు నిల్వ చేసినా, అమ్మినా, తాగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, మత్తు పదార్థాలు ఎవరు అమ్మినా, నిల్వ చేసినా, విషయాలు ఎవరికి తెలిసినా 100 లేదా నేరుగా పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## విద్యార్థులందరూ 10 జిపిఎ సాధించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిఈవో శ్రీనివాస్‌రెడ్డి

**బెజ్జంకి, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, నర్సింహుల పల్లి, ముత్తన్నపేట, దాచారం, తలారువానిపల్లి, వడ్లూరు, బేగంపేట గ్రామాల్లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను గురువారం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. పాఠశాలలో అమలు పరుస్తున్న మధ్యాహ్నభోజనాన్ని తనిఖీచేసి వంట మనుషులను మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వంట పాత్రలు, కూరగాయలు, బియ్యం శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులు 10 జిపిఎ వచ్చేలా కష్టపడి చదువుకోవాలన్నారు. బేగంపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. ఆయన వెంట మండల విద్యాధికారి మహతిలక్ష్మీ, బెజ్జంకి కాంప్లెక్స్ హెచ్ఎం కె.శ్రీరాములు ఉన్నారు.

## ఆరోగ్యశాఖ మంత్రికి శుభాకాంక్షలు



మంత్రి దామోదర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాపు మల్‌శెట్టి తదితరులు

**నారాయణఖేడ్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జన్మదినం సందర్భంగా రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకందారుల సంక్షేమసంఘం అధ్యక్షులు బాపు మల్‌శెట్టి హైదరాబాద్‌లో మంత్రి నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువతో సన్మానించి పూలబోకేను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకందారుల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షులు నాగయ్య, సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు గోవింద్‌యాదవ్, కల్లుగీత కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంజయ్యగౌడ్ తదితరులు మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## డబుల్‌బెడ్‌రూంలను పూర్తి చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న రవిందర్‌గౌడ్

**హుస్నాబాద్‌టౌన్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో లబ్దిదారులకు పంపిణీ చేసిన ఇండ్లు పూర్తిస్థాయిలో పూర్తి కాకపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు బయట కిరాయి ఇండ్లలో ఉంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిఎస్పి నియోజకవర్గ ఇంచార్జీ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని బిఎస్‌పి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈడబుల్‌బెడ్‌రూంల విషయంలో రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి ప్రత్యేకదృష్టి పెట్టి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో ముస్లిం మహిళలకు గత ప్రభుత్వంలోనే 80 కుట్టుమిషన్లు మంజూరయ్యాయని మంజూరైన మిషన్లను మహిళలకు అందజేస్తే వారు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం సహకరించినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి నాయకులు వెంకటేష్, శంకర్, మహేందర్, వేల్పుల రాజులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



సిర్గాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయితీ కార్మికులు

**సిర్గాపూర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని సిర్గాపూర్ పంచాయతీ కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేస్తూ గురువారం పంచాయతీ కార్యాలయం ముందు కార్మికులు నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా సిఐటియు డివిజన్ నాయకులు సతీష్ మాట్లాడుతూ మూడునెలల నుంచి కార్మికులకు వేతనాలు అందించకుంటే వారు తమ కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. అర్థాకలితో అలమటిస్తున్న కార్మాకులు చెల్లించాల్సిన బకాయి వేతనాలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇవ్వాల్సిన సబ్బులు, షాంపూలు, నూనె, బెల్లం తదితర వస్తువులు ఎప్పటికప్పుడే అందచేయాలన్నారు. సిఐటియు నాయకులు శివరాజ్, కార్మికులు నర్సింలు, తుకారాం, నరసింహ, లక్ష్మయ్య, సాయిలు పాల్గొన్నారు.

## అక్రమ కేసులు, అరెస్టులతో భయపడేదిలేదు

**గజ్వేల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** అక్రమకేసులు, అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని హాస్యం చేస్తున్న రేవంత్ ప్రభుత్వానికి ప్రజలు తగినబుద్ధి చెబుతారని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ మాదాసు శ్రీనివాస్ విమర్శించారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అక్రమ అరెస్టులు, కేసులతో ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని, నిర్బంధాన్ని ప్రశ్నించే గొంతులను నొక్కేయాలని ప్రయత్నిస్తుందని విమర్శించారు. మాజీమంత్రి హరీశ్‌రావును అక్రమంగా అరెస్టుచేస్తూ వేధింపులకు గురి చేయడం మంచిపద్ధతి కాదన్నారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం అడుగడునా హక్కులను కాలరాస్తూ రాజ్యాంగ విలువలను మంటగలుపుతుందని అన్నారు. ఆరుగ్యారంటీలతో పాటు ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఏడోగ్యారంటీ అని మాట్లాడిన రేవంత్‌రెడ్డి మాటలు నీటి మీద రాతలే అయ్యాయని ఎదేవా చేశారు. కేవలం ప్రతిపక్ష నాయకులను అదుపు చేసేందుకే పోలీసులు పనిచేస్తున్నారని, రాష్ట్రంలో శాంతిభద్రతలు గాలికొదిలేశారని అన్నారు. ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను వేధించేందుకే పోలీసులను వాడుతుందని అన్నారు.

# ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం

### -మండల వ్యవసాయ అధికారి ఝాన్సీ

**వెల్దుర్తి, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మాసాయిపేటలోని రైతు వేదికలో గురువారం ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భాగంగా నేల ఆరోగ్యానికి సహకరించే విధంగా జీవన ఎరువులు, పంటమార్పిడి పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం లాంటి ఆధునిక పద్ధతులను ఆచరిస్తూ రైతులు నేలల ఆరోగ్యాన్ని, తద్వారా ఆరోగ్యవంతమైన పంటలను పండించాలని వివరించారు. మండల వ్యవసాయ అధికారి ఝాన్సీ మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి అనే రైతు పొలాన్ని సందర్శించి వరి కొయ్యలను తగలబెట్టకుండా పొలాన్ని దున్ని ఎస్ఎస్‌పి వాడి వరి కొయ్యలను కుళ్లబెట్టి పొలాన్ని తయారు చేసుకోవాలని సూచించడం జరిగింది. అలాగే వారి పొలంలో భూసార పరీక్ష కొరకు మట్టి నమూనాను సేకరించారు. దీనిద్వారా నేలలో ఉన్న పోషక విలువలను తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని, ఏ పోషకాలు ఉన్నాయో, ఏయే స్థాయిలో ఉన్నాయో తెలుసుకొని, వేసిన పంటకు అవసరాన్ని బట్టి ఎరువులను వాడడానికి అవకాశం ఉంటుందని వివరించారు. మండలంలోని రైతులు




రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారి ఝాన్సీ

వరికొయ్యలను తగలబెట్టి వాతావరణ కాలుష్యానికి దోహదం చేయకుండా ఎస్ఎస్‌పి వాడి కొయ్యలను కుళ్లబెట్టడం ద్వారా పంటనేలలను, తద్వారా నేలసారాన్ని సంరక్షించు కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామ్ శివరావు, ఏఈవో రజిత, మాసాయిపేట్ మాజీ సర్పంచి మధుసూ దన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి కృష్ణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, భూస్వామి శ్రీనివాస్, మహేష్, శ్రీకాంత్, కృష్ణ, సురేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## హరీష్‌రావు, కౌశిక్‌రెడ్డిల అరెస్టు అప్రజాస్వామికం

**బెజ్జంకి, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై అక్రమకేసు పెట్టారని పరామర్శించడానికి వెళ్లిన మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావును అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పాకాల మహీపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని ప్రజాస్వామ్యంలో ఒక ఎమ్మెల్యే ఫోన్‌ను ట్యాపింగ్ చేయడం సరికాదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రపాలనపై దృష్టిపెట్టాలి కానీ పాలన చేతగాక ప్రతిపక్ష నాయకులపైన అక్రమకేసులు పెట్టించి అరెస్టు చేయించడం సిగ్గుచేటన్నారు.

## అక్రమ అరెస్టులు చేస్తే అగ్నిగోళం సృష్టిస్తాం



విలేకరులతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేతలు

**పాపన్నపేట, డిసెంబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రజల గొంతుకైన మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావును అక్రమంగా అరెస్టు చేయడం తగదని, అక్రమ అరెస్టులు ఆపకుంటే అగ్నిగోళం సృష్టిస్తామని బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి హెచ్చరించారు. గురువారం మండల నాయకులతో ఏడుపాయల కమాన్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మాజీమంత్రిపై చక్రధర్‌గౌడ్ తప్పుడు ఫిర్యాదులు చేస్తే అరెస్టు చేయడం సరికాదన్నారు. వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమని గుర్తించి పోలీసులు బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. పోలీసులు ప్రభుత్వానికి తాబేదారులుగా వ్యవహరించవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, మండల మాజీసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు జగన్నాథం, ఏడుపాయల మాజీచైర్మన్ బాలాగౌడ్, మాజీ జడ్పిటిసి సభ్యులు ఆంజనేయులు, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ మాణిక్ రెడ్డి, కిష్టయ్య, వెంకటేశం, మనోహర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అయ్యప్ప పడిపూజ

**సిద్ధిపేట రూరల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**

సిద్ధిపేట కోటిలింగాల దేవా లయం ఆవరణలో అయ్యప్ప మహాపడిపూజ అంగరంగ వైభవంగా జరి గింది. భజనలు, అగ్నిగుండాలు, పల్లకి ఊరేగింపులు, అభిషేకాలతో భక్తి పారవశ్యంలో కొనసాగింది. బుధవారం రాత్రివరకు సాగిన వేడుకల్లో రాజు గురుస్వామి ఆధ్వర్యంలో గణపతిహోమం, స్వామికి అభిషేకం నిర్వహిం చారు. నారికేళస్వామి 18వ సారి మాలధారణ వేసిన స్వామి, తాటి నరసింహులు 5వ సారి మాలధారణ వేసిన గజ్వేల్ శ్రీకాంత్‌ల సౌజన్యంతో జరిగిన మహాపడిపూజలో అయ్యప్పస్వామి విగ్రహాన్ని రంగురంగుల పూలతో అలంకరించారు. వేడుకల్లో అయ్యప్పస్వాములు ఎంతో ఉత్సహంగా పాల్గొన్నారు. సిద్ధిపేట నుంచి శబరిమలై వరకు అక్టోబర్ 22 నుంచి నవంబరు 29 వరకు మహాపాదయాత్ర చేసిన అయ్యప్ప స్వాములకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు.

## అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హరీష్‌రావుతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**

అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శిం చారు. గురువారం మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును అక్రమంగా అరెస్ట్ చేసి గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో విషయం తెలుసుకున్న ప్రతాప్‌రెడ్డి హుటాహుటిన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేషన్‌కు వెళ్లి హరీష్‌రావును పరామర్శించారు. ఈసందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి తాటాకు చప్పుళ్లకు హరీష్‌రావు భయపడరన్నారు. ప్రజాస్వా మ్యాన్ని ఖూనీ చేయడమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని విమర్శిం చారు. హరీష్‌రావును అక్రమంగా అరెస్టు చేయడం రేవంత్‌రెడ్డి పిరికిపంద చర్య అన్నారు. గతసంవత్సరం నుండి రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న వైఫల్యాలపై మాట్లాడుతున్నందుకు కక్షపూరితంగా అక్రమకేసులు బనాయి స్తున్నారని అన్నారు. అన్నివిధాలుగా రేవంత్‌రెడ్డి సర్కార్ వైఫల్యం చెందిందని ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు.

## ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యవర్గం ఎన్నిక

**నాగల్‌గిద్ద, డిసెంబరు 5, ప్రభాతవార్త:**

మండల ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. గురువారం మండల కేంద్రమైన నాగల్‌గిద్దలో ఉపాధ్యాయ ఫెడరేషన్ మహాసభలను నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల అధ్యక్షులుగా విఠల్, ప్రధాన కార్యదర్శిగా నర్సింలు, ఉపాధ్యాక్షులుగా సంగమణి, కోశాధికారిగా మాదన్న, ఆడిటర్‌గా నాగప్ప, ఎఫ్‌డబ్లుఎఫ్ కన్వీనర్‌గా రంజిత్ కుమర్, కో-కన్వీనర్‌గా చెన్నప్పలను నియమించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు కె.అశోక్, ఉపాధ్యక్షులు కాశీనాథ్, జిల్లా కార్యదర్శి నరేష్‌లు హాజరైనారు. విద్యారంగ పరిరక్షణకు తమవంతు కృషి చేస్తామని అధ్యక్షులు విఠల్, ప్రధాన కార్యదర్శి నర్సింలులు పేర్కొన్నారు. నారాయణఖేడ్‌లో నిర్వహించనున్న జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు.

## అరచేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్ పోరెడ్డి

**గజ్వేల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలోతొక్కి అధికారం వచ్చిన తర్వాత అరచేతిలో వైకుంఠం చూపించారని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కిషోర్ పోరెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలపై, ఆరు గ్యారంటీలు 66 మోసాల గురించి గురువారం ప్రజ్ఞాపూర్ నుండి గజ్వేల్ ఇందిరాపార్కు చౌరస్తా వరకు బిజెపి రాష్ట్ర యువజన నాయకుడు నలగామ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఇందిరాపార్కు చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సభలో కిషోర్ పోరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా రాష్ట్ర ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని గద్దెనెక్కి ఒక్క గ్యారంటీని కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లాగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, రెండూ ఒక్కటేనని, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కాకికోకిలలా ఉంటున్నాయన్నారు. పదిసంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలిందని ప్రజలు గ్రహించి కాంగ్రెస్ ప్రభుత్వం మార్పు తీసుకువస్తుందేమోనని ప్రజలు ఓటు వేస్తే సంవత్సరం గడిచినా ఒక్క సంక్షేమ పథకం అమలు చేయకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. అనంతరం రాష్ట్ర బిజెపి యువజన నాయకుడు నలగామ శ్రీనివాస్ బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కిషోర్ పోరెడ్డిని సన్మానించారు.

## యువజన కాంగ్రెస్‌ను పటిష్ఠం చేయాలి



జనగామ డిసిసి అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, డిసెంబరు 5, ప్రభాతవార్త:** కొమురవెల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఏర్పుల రాజు ఎన్నిక కావడంతో గురువారం జనగామ డిసిసి అధ్యక్షులు కొమ్మూరు ప్రతాప్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఆయన అశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా జనగామ డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ యువజన కాంగ్రెస్‌ను మండలంలో మరింత పటిష్ఠం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మనిషి ఉనికికి, జీవనానికి మూలాధారం మట్టి

**సిద్ధిపేట అర్బన్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మనిషి ఉనికికి, జీవనానికి మట్టి మూలాధారమని పంటలు పండడానికి అవసరమైన నేల పైపొర క్రమక్రమంగా దెబ్బతింటున్న నేపథ్యంలో నేల క్రమక్షయానికి గురికాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సిద్దిపేట అర్బన్ మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్ అన్నారు. మండల పరిధిలోని పొన్నాల రైతువేదికలో గురువారం ప్రపంచ మృత్తికా(నేల)దినోత్సవం సందర్భంగా నేలసంరక్షణ చర్యలపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రసాయన వ్యవసాయం, అటవీ నిర్మూలన, కాలుష్యం, ప్లాస్టిక్, రసాయన వ్యర్థాల వలన నేల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. నేల ఆరోగ్యం బాగుంటేనే పంటలు బాగా పండుతాయన్నారు. రైతుల ఆదాయం నేల ఆరోగ్యం పైనే ఆధారపడుతుందన్నారు. రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వినియోగించి పంటల దిగుబడి సాధించాలన్నారు. అనంతరం మట్టి పరీక్షల కోసం నమూనా సేకరించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు.

## హరీష్‌రావును అరెస్టు చేయడం సిగ్గుచేటు



విలేకరులతో మాట్లాడుతున్న స్వామిచారి

**గజ్వేల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మాజీమంత్రి హరీష్‌రావు అరెస్టును ఖండిస్తున్నట్లు బిఆర్ఎస్ పట్టణ యువజన అధ్యక్షుడు గడియారం స్వామిచారి తెలిపారు. గురువారం సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీష్‌రావును అక్రమంగా అరెస్టుచేస్తున్న విషయాన్ని తెలుసుకొని తనకు మద్దతుగా గచ్చిబౌలిలోని పోలీస్‌స్టేషన్‌కు తరలివెళ్ళారు. అనంతరం మాజీమంత్రి హరీష్‌రావును పరామర్శించి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నియంతలా ప్రవర్తిస్తుందని, ప్రశ్నించే గొంతులను అరెస్టులతో భయపెడుతుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని, కక్షపూరితంగా వ్యవహరిస్తే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపల్

**సిద్ధిపేట అర్బన్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎయిడ్స్ ర్యాలీ, అవగాహన సదస్సులో పాల్గొన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల కో-ఎడ్యుకేషన్ విద్యార్థులు ఈశ్వర్, శివప్రసాద్‌లకు అభినందనపత్రాలను అందజేశారు. ఎయిడ్స్‌ని నియంత్రించడానికి మేము సైతం అని పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అఫీసర్ దరిపల్లి నగేష్, స్టూటెండ్ కౌన్సిలర్ కనకచంద్రం, మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్ ఆధ్యాపకులు ప్రసాద్‌కుమార్, వెంకటరమణ, రాజ్యలక్ష్మి, సత్యనారాయణ, అశోక్, ఖుర్షిదా, కొమురయ్య, శ్రీనివాస్, ఫాతిమా, నవనీత, సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## బూత్ కమిటీలు పార్టీ పటిష్ఠతకు మేలు



నియామక పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

**మిరుదొడ్డి, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు దేవరాజు ఆధ్వర్యంలో గురువారం జరిగిన బూత్ కమిటీ ఎన్నికలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిరుదొడ్డి 94వ బూత్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. 94వ బూత్ కమిటీ అధ్యక్షులుగా సాన నాగరాజును నియమించారు. ఈ సందర్భంగా బాలేష్‌గౌడ్ మాట్లాడుతూ బూత్ కమిటీలు పార్టీ పటిష్ఠత కోసం ఎంతో దోహదపడతాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరవేసేలా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరుగ్యారెంటీలను అమలుచేయడం లేదని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కానుగంటి శ్రీనివాస్, జిగిరి అమర్, కడారి యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, రాజు, సురేష్, భాను, కరుణాకర్, నాగరాజు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించాలి




ప్రపంచ మృత్తిక దినోత్సవంలో వ్యవసాయ అధికారి జయంత్

**చిన్నకోడూరు, డిసెంబరు 5, ప్రభాతవార్త:**

రైతులు ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వలన నేలలు జీవరహితంగా మారుతున్నాయని మండల వ్యవసాయాధికారి జయంత్ అన్నారు. మండల పరిధిలోని రైతు వేదికల్లో గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గంగాపూర్ రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించాలన్నారు. సేంద్రియ ఎరువులు వినియోగించడం వలన నేలల భౌతికస్థితి మెరుగుపడి భూమి గుల్లగా మారి నేలలోనికి నీరు ఇంకే గుణం పెరుగుతుందన్నారు. నేలలో సేంద్రియ పదార్థం వేయడం వలన సూక్ష్మజీవులు వృద్ధిచెంది రసాయనిక చర్యల వలన నేలసారం పెరగడమే కాకుండా నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకొని ఉత్పాదకత సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. భూమిలో రసాయన ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యత పెరగడానికి హరిత ఎరువులు పచ్చిరొట్టె ఎరువులు ఉపయోగపడుతాయన్నారు. వరిపొలంలో వరికొయ్యలను కాల్చడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏఈవోక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అప్రజాస్వామిక అరెస్టులు

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**

మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిల అరెస్టు అప్రజా స్వామికమని హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిల అరెస్టును తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రభుత్వాని ప్రశ్నించే వారిపై కుట్రపూరితంగా కేసులువేస్తూ అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ హామీలతో పాటు ఫోన్ ట్యాపింగ్ విషయంలో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన పాడి కౌశిక్‌రెడ్డి ఫిర్యాదును అక్కడి సిఐ తీసుకోకుండా తనను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం సబబు కాదన్నారు. అధికారులు కూడా ఎప్పటికీ ప్రభుత్వాలు శాశ్వతం కాదని గుర్తుంచుకోవా లన్నారు. ఎమ్మెల్యేను రెచ్చగొట్టి మరీ తననే అరెస్టు చేయడానికి ఉద యమే పోలీస్ బలగాలు మోహరించడం, ఎమ్మెల్యే ఇంటికి వచ్చిన హరీష్‌రావును అరెస్టుచేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వానికి దమ్ముంటే ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను 100 రోజుల్లోనే అమలు చేస్తానని ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఇలాంటి అక్రమకేసులకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు భయపడదని, ఎన్ని కేసులు వేసినా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా భరత్‌గౌడ్

**పాపన్నపేట, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మెదక్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన భరత్‌గౌడ్ ఎన్నికయ్యారు. నియోజకవర్గంలో యువతను చైతన్యపరుస్తూ పార్టీ అభ్యున్నతికి తనవంతు కృషిచేస్తానని భరత్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందేలా తనవంతు చర్యలు తీసుకుంటామన్నారు.

## అధ్యాపకుల పోస్టులకు ధరఖాస్తుల ఆహ్వానం

**సిర్గాపూర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో గెస్ట్ టీచర్లుగా విధులు నిర్వహించేందుకు అర్హులైన వారు ధరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ సంతోషి కుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పిజిసిఆర్‌టి తెలుగు, సిఆర్‌టి ఇంగ్లీష్ ఉద్యోగాలకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు మహిళా అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విధులు నిర్వహించేందుకు ఆసక్తి గల అభ్యర్థులు రెండు రోజుల్లో ధరఖాస్తులు చేసుకోవాలని సంతోషి కుమారి సూచించారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

**శివ్వంపేట, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండలంలోని చండి గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఇటీవల ప్రమాదానికి గురై గాయాలు పాలుకాగా చికిత్స నిమిత్తం మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్‌గుప్తా 5వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా పోతుల బొగుడ గ్రామానికి చెందిన చాకలి నరసయ్య, నాగులు మృతిచెందగా వారి కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షులు ముత్యంరెడ్డి, నాయకులు, వెంకట్‌రెడ్డి, నర్సారెడ్డి, ఆంజనేయులు, చాకలి మల్లయ్య, బిక్షపతి,కృష్ణ, వీరేష్, కుమ్మరి సురేష్, పాల్గొన్నారు.